

రామకృష్ణ; ఎన్.ఏ.టి. కంబైన్స్

వరకట్నం

పాత్రలు		పాత్రధారులు
దేవసింహుడు	కథానాయకుడు	నటరత్న, పద్మశ్రీ **యన్** టి. రామారావు. బి. ఏ.
మీసాల వెంకయ్య	అతని తండ్రి	శ్రీ నాగభూషణం
అన్నపూర్ణ	అతని తల్లి	శ్రీమతి హేమలత
సుజాత	కథానాయకి	కుమారి కృష్ణకుమారి
సుభద్ర	ఆమె వదిన	శ్రీమతి సావిత్రి
బలరామయ్య	ఆమె అన్న	శ్రీ సత్యనారాయణ
భద్రయ్య	ఆమె తండ్రి	శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
చుక్కమ్మ	గయ్యాళి అత్త	శ్రీమతి సూర్యకాంతం
దేవయ్య	ఆమె భర్త	శ్రీ రేలంగి వెంకట్రామయ్య
రంగయ్య	ఆమెకొడుకు	శ్రీ పద్మనాభం
లక్ష్మి	ఆమె కోడలు	కుమారి చంద్రకళ
శ్రీరాములు	ఆమెవియ్యంకుడు	శ్రీ పెరుమాళ్లు
సుబ్బయ్య	ఆయన కొడుకు	శ్రీ ప్రభాకరరెడ్డి
రమ	ఆయన కోడలు	శ్రీమతి బృందావనచౌదరి
బేబీరాణి	ఆయన మనుమడు	
రాజలక్ష్మి	మనుమరాలు	
మల్లయ్యదొర	ఆ పరగణామోతుబరి రైతు	శ్రీ రాజనాల
భట్టుమూర్తి	ఆయన అనుయాయుడు	శ్రీ రావి కొండలరావు
తంపులమారి అచ్చయ్య		శ్రీ అల్లు రామలింగయ్య

కథా సంగ్రహం

వరకట్నపు పిశాచాల దురంతాల కోరలలో
అన్నెం పున్నెం యెరుగని ఆడబ్రతుకు బలియేనా ?
ఇదేనా - మన సంప్రదాయమిదేనా ?

గుండెలు కలచే ఈ ప్రశ్నకు ఆనాటినుంచి ఈనాటివరకు సమాధానం రాలేదు. ఒకనాడు రివాజుగా ప్రారంభమై, ఆ తర్వాత సాంప్రదాయమై చివరికది దురాచారమై పచ్చని సంసారాలెన్నో కూల్చి, యెన్నో ప్రాణాలు పీల్చి, సంఘం నెత్తినే మహామారిగా తిష్ట వేసుకున్న ఈ వరకట్న పిశాచం - అభ్యుదయ పథంలో పురోగమిస్తున్నామనుకునే మహామహులకు, సంఘసంస్కర్తలకు అంకెకురాక, అందర్నీ ఆవేశించి, ఆశపెట్టి లోబరచుకుంటోందంటే - ఇక దీని ప్రభావమెంతటిదో ఊహించుకోవచ్చు.

ఆశకంటె ఆకర్షణను చంపుకోగలిగిన ఆత్మ నిగ్రహం, మమతల విలువలు తెలుసుకోగలిగిన మానవత్వం, స్త్రీని గౌరవించ గలిగిన సంస్కృతి మనలో వికసించినపుడే దీన్ని అంతమొందించటం సాధ్యమవుతుంది, కాని ఉపన్యాసాలుతోను, చట్టాలతోను దీన్ని రూపుమాపలేము. ఈ ఆశాపిశాచికి యెందరాడబిడ్డలు, అభం శుభం తెలియని యెందరమాయక ప్రేమికులు యెలా భగ్నజీవులై బలి అయిపోతున్నారో చూపటమే ఈ చిత్రం పరమార్థం.

మీసాల వెంకయ్య యెంత పట్టుదలగల మనిషో పేరులోనే తెలుస్తోంది. తను వంగడానికి వంశగౌరవానికి అనుగుణంగా యాభైవేల కట్నంతో కొడుకు దేవసింహుడి పెళ్లి ఘనంగా చేద్దామనుకున్నాడు. కాని తంపులమారి అచ్చయ్య ప్రేరేపణతో మూడుముళ్లూ పడకుండానే మధ్యలో ఆగిపోయింది పెళ్లి. పట్టింపు అంటూ వచ్చింది కనుక నెల తిరిగేలోగా నాకొడుక్కి పెళ్లి చెయ్యకపోతే నే మీసాల

వెంకయ్యనే కాదన్నాడాయన. మీసం మాకూ ఉంది. కట్టిన తోరణం విప్పకుండా నా చెల్లెలి పెళ్లి చెయ్యకపోతే నే భద్రయ్య గారి కొడుకునే కాదన్నాడు బలరామయ్య. ఈ పంతాలమధ్య నలిగి క్రుంగిపోయారు – అటు తల్లి అన్నపూర్ణమ్మ – ఇటు వదిన సుభద్ర.

అనుకున్న కట్నం సమయానికి ఇవ్వనందున ఇంకో విధంగా అవాంతరం వచ్చిపడింది మరో పెళ్లికి. కాని తెలివిగల చుక్కమ్మ కొడుకు తెగబడి తాళికట్టేశాడు. మూడుముళ్లూ పడ్డాయి కనుక ఆ పిల్ల మీకోడలే అన్నారు వచ్చిన పెద్దలు. ఆ మాటలో చుక్కమ్మ ఛర్రుమని పెళ్ళవగానే సరా ? కట్నం తేకుండా నా కొడుకుతో యెలా కాపరం చేస్తుందో నేనూ చూస్తానని ప్రతిజ్ఞ పట్టింది.

ఆనాడు తాను ముడివేయలేక వదలిన మాంగల్యంతో దీనంగా తనవైపు చూసిన ఆ అమాయకురాలి రూపమే దేవసింహుడికి అనుక్షణం కళ్ళముందు మెదులుతూ వచ్చింది. పట్టుదలలో ఆ తండ్రికి తీసిపోని కొడుకు – కట్నం యెరతో అచ్చయ్య తెచ్చిన సంబంధాలన్నిటినీ తిరగగొట్టి, ఒక నిర్ణయంతో నిశ్చలంగా నిలబడ్డాడు. భార్య అనేది ఈ జీవితానికి రాసివుంటే ఆనాడు కాలుత్రొక్కి కంకణం కట్టిన ఆ పిల్లే తన అర్ధాంగి అని నిష్కర్షగా చెప్పాడు. పెళ్ళపందిట్లో అంత అవమానంచేసిన వారిపిల్లను సిగ్గులేకుండా ఇంటికెలా తెస్తాడో ఇల్లాలుగా ఎలా ఏలుకుంటాడో నేనూ చూస్తానని మీసందువ్వాడు వెంకయ్య.

కట్నం తేలేని కోడల్ని పనిమనిషికంటే హీనంగా చూస్తుంది రాకాసి చుక్కమ్మ. 'నే వండమన్నదే వండాలి, నే తినమన్నతర్వాత తినాలి, వాసననూనె రాసుకోకూడదు, వాలుజడ వేసుకోకూడదు, పూలు పెట్టుకోకూడదు, పడకగదిలోకి తొంగి చూడకూడదు, అని ఆంక్షలన్నీ పెట్టి ఆ అమాయక ప్రేమికుల్ని విడదీసి, కసి తీర్చుకో సాగింది. భర్త దేవయ్య జాలిగుండెగలవాడైనా గయ్యాళిపెళ్ళాన్ని అదుపులోపెట్టే సమర్థతలేక – 'మొగుడు ముండయితేను – కొడుకు

వెధవయితేను - పెళ్లాల ప్రభ సాగునోయీ!' అని తత్వం పాడుతూ సరిపెట్టుకున్నాడు. చేతనయితే నువ్వు చెయ్యి ఆ మరమ్మత్తు. అభ్యంతరం ఆవగింజంతయినా లేదని కొడుకును పురమాయించాడు.

అంత తండ్రే చెయ్యలేనికార్యాన్ని కొడుకు యెలా చేశాడు? అమ్మ పెట్టిన అంతులేని ఆంక్షలమధ్య, అర్ధాంగిమీది ఆపేక్షకు లోటు రానీయకుండా కట్టుకున్న యిల్లాలితో యెలా కాపరం చెయ్యగలిగాడు ? గయ్యాళి తల్లికి యెలా బుద్ధిచెప్పగలిగాడు ? కట్నంయివ్వలేక, కన్నకూతుర్ని సుఖపెట్టలేక ఏ యేట్లోనోపడి కన్నుమూద్దామనుకున్న మామగారి కుటుంబాన్ని యెలా ఉద్ధరించగలిగాడు ? సంసారాలు సుఖపడాలంటే అత్తలు కోడళ్ళను యెలా చూడాలి - అన్న పరమార్ధాన్ని దేవయ్య చుక్కమ్మకి యెలా బోధించగలిగాడు ?

ఇటు కన్న తండ్రి పట్టుదల, అటు అత్తవారి కక్షలమధ్య ఎలా మనిషిగా నిలబడి దేవసింహుడు - ఈనాటి యువకప్రపంచానికి ఆదర్శంగా ఆనాడు కాలుత్రొక్కి కంకణం కట్టిన ఆ పిల్లనే తన అర్ధాంగిగా యెలా చేసుకోగలిగాడు ? ఇన్ని విభిన్న మనస్తత్వాల మధ్య ఆశలతో, ఆంకాంక్షలతో నలిగిపోయిన సుకుమార జీవితాలు యెలా కుదుటపడ్డాయి ? కట్నాల పిశాచి సాగిస్తున్న విలయ తాండవాన్ని యెలా ఆపగలిగారు ? విషవలయాన్ని యెలా దాటగలిగారు ? ఈ కట్నాల వ్యామోహానికి లోనుకాకుండా కన్నకొడుకుల్ని కాసులకి అమ్ముకోకుండా పెద్దవాళ్లు తప్పుకుంటే- యువదంపతులు యెంత మధురంగా జీవితాల్ని పండించుకోగలుగుతారో, ఆ గృహాలు యెంత సుఖసంతోషాలతో కలకలలాడుతుంటాయో, ఆ జీవితాలు యెంత ఆనందోత్సాహాలతో పరవశిస్తాయో-అన్న పరమార్ధాన్ని ఈ చిత్రం యెలా తీర్చిదిద్దిందీ తెరమీద చూసి ఆనందించండి.

మంచి ఉంటే తీసుకోండి అందులో ఆవంతయినా ఆచరించగలిగితే మా ప్రయత్నం ఫలించినట్లే...!

★

★ పాటలు ★



1వ పాట

రచన : కొసరాజు　　　పాడినవారు : సుశీల, తిలకం

ఎందుకీ తొందర
సుందరాకార - నీ
ముందే నేనున్నానురా నా సామి
నీయందే మనసున్నాదిరా
కొసరికొసరి నాతో
సరసమాడెదవేల
మావారు చూచిన - మాటవచ్చును చాల
తగిన సమయముచూచి - తప్పక తలుపుతీసెద ఆగవోయీ
కరువుతీరగ బిగ్గకౌగిట - గారవించెద నమ్మవోయీ
॥ఎందుకీ॥

1 ఎ

మందార గంధమిదే – బుగ్గపై పూసెదరా
అత్తరూ పన్నీరు – మోజుదీర చిలికెదరా ॥మందార॥
నిన్నరాతిరి గంటు – చెదరక నిలిచెనురా
చెంతకూ చేరదీసి – ముద్దు తీర్చుకోవేరా ॥మందార॥

1 బి

చూడు ఓయమ్మా
గడుసు గుంటడూ
కన్నుగొడతాడెందుకూ ॥చూడు॥
రాజవీధిని దారిగాచీ – రమ్మనంటాడెందుకూ
ఎన్నిచెప్పిన పైటచెంగూ–వదలనంటాడెందుకూ ॥చూడు॥

2వ పాట

రచన: డా॥ సి. నారాయణరెడ్డి   పాడినవారు : ఘంటసాల



ఇదేనా
సంప్రదాయమిదేనా
తరతరాలుగా సంఘంలోన
కరడుగట్టిన దురాచారం ॥ఇదేనా॥
వరకట్నపు పిశాచాల దురంతాల
కోరలలో
అన్నెం పున్నెం ఎరుగని
ఆడబ్రతుకు బలియేనా ॥ఇదేనా॥
చట్టాలనుచేసి లాభమేమి దినందినం
శాసనాలు వేసి లాభమేమి
బుసగొట్టే స్వార్థమ్మును విసరికొట్టలేనిది
సహనమూర్తైన స్త్రీని గౌరవించలేనిది ॥ఇదేనా॥

పురాణాలు తిరగేసిన చాలదు
హెయ్ ధర్మపన్నాలు వల్లించిన తీరదు
చెప్పే నీతులన్ని చేతలలో చూపాలి
అబలల కన్నీటిమంట లార్పివేయగలగాలి ॥ఇదేనా॥

3 తత్వం   పాడినవారు : మాధవపెద్ది



ఇల్లువాకిలిరోసె యిల్లాలు పెడరోసె
యీ తీరునున్నాను కొడకా
పట్టిమంచమురోసె పడకదిండూ రోసె
పంచపాలైతిరా కొడకా నేను
పంచపాలైతిరా కొడకా !!

4వ పాట

రచన : కొసరాజు   పాడినవారు : పిఠాపురం, జమునారాణి

రంగయ్య :



మల్లెపూల పందిట్లోనా
చందమామ వెన్నెట్లోనా
చల్లగాలికి లేపుకొస్తినిగదవే
నా చిలకలకొలికీ ముద్దుముద్దుగ
చేరదీస్తినిగదవే-

లక్ష్మి • ఇంటిలోన అత్తగారూ
పంచలోన మామగారూ
చుట్టు ఉన్నది ఊరు వారురా
నాసామిరంగా ఆరుబైట తొందరెందుకురా-

రంగయ్య : ఇంటివాళ్లు లేస్తేనేమి
ఇరుగుపొరుగు చూస్తేనేమి
ఆలుమగలకు అడ్డమేముందీ
నా చిలకలకొలికి నాకు నీకు కుదిరిపోయింది
॥మల్లెపూల॥

లక్ష్మి : ఏమినోములు నోచినానో
ఎన్ని జన్మల పుణ్యఫలమో
నీవే నాకు స్వామివైతివిగదరా
నాసామిరంగా నిండుమనసే కానుకనిస్తినిగదరా–

రంగయ్య & లక్ష్మి :
మల్లెపూల పందిట్లోనా
చందమామ వెన్నెట్లోనా
మనసులొకటై మిగిలిపోయాము
ఎడబాటుకానీ మమతలోనా కరిగిపోయాము–

5వ పాట

రచన : డా॥ సి. నారాయణరెడ్డి పాడినవారు : ఘంటసాల,
సుశీల



సాకీ : మెరుపు తీగలలోని
మిసిమిసి నిగ్గులుదాల్చి
మల్లెమొగ్గలలోని
నునుసిగ్గులేకూర్చి
సురగంగ కెరటాల
నురుగులే విరబూసి
నాకొరకు ధరణిపై దిగిన దేవతవీవు–
చరణం : అడుగు అడుగులో మదమరాళములు
తడబడి పోవగరావే


కులుకు కులుకులో కలమయూరములు
తలలువాల్చగారావే
నవ్వునవ్వులో పున్నమివెన్నెల
రవ్వలు రాల్చగరావే

సాకీ : అలనాటినుండి పెనుశిలవోలెవున్నాను
చిగురించలేని మ్రోడుగ మిగిలివున్నాను
ఎదురు తెన్నులుచూచి కనులు కాయలుకాచి
తొలినోముపంటగా నిను కనుగొన్నాను

చరణం : నినువీడలేను యికక్షణము
నడచేను నీడగ అనుదినము
చరణాల సన్నిధినేను
పరచేను విరిసిన మనము

6వ పాట

రచన : కొసరాజు   పాడినవారు : పిఠాపురం, జమునారాణి



లక్ష్మి : గిలకలమంచం వుండీ
చిలకల పందిరియుండీ
యిల్లూవాకిలి యుండగా –
నాసామి
యీ గూడు చాలేందయా!

రంగయ్య: అక్కడ ఒరిగేదేంది
ఇక్కడ తరుగేముంది
ఎక్కడ మనజంట వుంటే – నా లచ్చిమి
అక్కడనే స్వర్గముండేను.

లక్ష్మి : బులిబులిమాటలతో బలవంతం చేస్తారు
ఊరించి ఉబ్బించి మొగమాటపెడతారు
అత్తచాటుదాన్ని నేనయో – నాసామి
ఆమెచూస్తె మండిపడునయో

రంగయ్య: భర్తే నిత్యమని అత్త స్థిరముగాదని
జ్ఞానులు చెప్పుమాటలే - నా లచ్చిమి
పతివ్రతలు పోవుబాటలే ॥గిలకల॥

"అమ్మబాబోయ్ అమ్మ"

లక్ష్మి : ఆడవాళ్ళ ముందేమో సొరకాయలు నరుకుతారు
అమ్మపేరు చెప్పగానే ఆరామడ ఉరుకుతారు
మగవారి కల్లమాటలు - నాసామి
నమ్ముకుంటె నీళ్ళమూటలు

రంగయ్య: అమ్మమీద భక్తిచేత అలా అలా వున్నానే
పెళ్ళామంటే బలే ప్రేమలే - నాలచ్చిమి
పిడకల గుడిసైతేనేమిలే - నాలచ్చిమి
పిడకల గుడిసైతేనేమిలే ॥గిలకల॥

7వ పాట

రచన : కొసరాజు   పాడినవారు : సుశీల, జిక్కి



పుట్టలోని నాగన్న లేచిరావయ్యా
స్వామీ-పైకి రావయ్యా
గుమ్మపాలు తెచ్చినాము
తాగిపోవయ్యా
వేయి దండాలయ్యా
వేయి దండాలయ్యా ॥పుట్టలోని॥

నీ కోరల్లో విషము దాచుకోవయ్యా
నీ బుసగొట్టే కోపం ఆపుకోవయ్యా
మనసులోని కోరికలు మక్కువతో తీరిస్తే
మరువక నాగులచవితి పూజ మేముచేసేము ॥పుట్టలోని॥

ప్రాణాచారంబడ్డ నాంచారమ్మా
గుట్టుగా ఏమని కోరినావమ్మా
మంచి మొగుడుకావాలని మోజుపడ్డావా
చిట్టిపాప పుట్టాలని మొక్కుకున్నావా
అనుకున్నది అయితేను ముడుపులు చెల్లిస్తానని
అనవే అనవేమే నువ్వనవే నువ్వనవే ॥పుట్టలోని॥
మా పసుపూ కుంకమా ఎప్పుడు పచ్చగుండాలి
మా పిల్లా పాప చల్లగవర్థిల్లాలీ
ఏటేటా నిన్నే మా యిలవేల్పుగ కొలవాలీ
పుట్టలోని నాగన్న ఏలుకోవయ్యా
నీవే మా స్వామివని నమ్మినామయ్యా
నీకు దండాలయ్యా వేయి దండాలయ్యా
కోటి దండాలయ్యా ... ...

8వ పాట

రచన : కొసరాజు పాడినవారు : ఘంటసాల, మాధవపెద్ది

సై సై జోడెడ్లాబండీ బండి
షోకైన దొరలా బండీ ॥మహాప్రభో॥



ఘంగుఘంగుమను గంటలబండీ
ఘల్లుఘల్లుమను గజ్జలబండీ
చుట్టుప్రక్కల పన్నెండామడ
దీనికిపోటీ లేదండీ ॥మహాప్రభో॥

(1) కంటికి కాటుకెట్టి – గట్టున్న గడ్డికోసి
గుత్తంగ రైకతొడిగి – కొడవలేసి కోతకువంగే
వగలాడి ఓరగచూస్తే – ఉలిక్కిపడతవి నా ఎడ్లూ
॥మహాప్రభో॥

(2) నెత్తిన్నమత్తబెట్టి – అడుగులో అడుగూవేసి
సరదాగా సరసాలాడుతు – పరిగేరుతు పకపకలాడే
నెరజాణ సైగలుచూస్తే – కనపడదూ ముందుదారి–
॥మహాప్రభో॥

(3) మట్టిగోసి గట్టిగదోపి – మట్టితట్ట పైకిలేపి
యీలవేసి బండమీద ఒడుపుగా – దెబ్బమీద పై దెబ్బవేసి
చిలుకలకొలికీ కులుకుతువుంటే – జల్లుజల్లుమంటది – నా వళ్లు
॥మహాప్రభో॥

9వ పాట

రచన : డా॥ సి. నారాయణరెడ్డి   పాడినవారు : ఘంటసాల
సుశీల

అతను ; దివినేలు ముక్కోటి
దేవతలే సాక్షిగా
భువినేలు పంచభూత
మ్ములే సాక్షిగా
అనురాగమూర్తులౌ ఆ
ఆదిదంపతులే రక్షగా
నిన్ను అర్థాంగిగా
నిలుపుకున్నాను



ఆమె : ఎన్నాళ్ళకు నా నోము పండింది
ఇన్నాళ్ళకు నా దైవం పలికింది
కన్నీళ్ళకు పున్నమియే కరిగింది
ఆ వెన్నెల జల్లుల బ్రతుకే పూచింది ॥ఎన్నాళ్ళకు॥

అతను ; నా జీవన నౌకను నడిపే చుక్కానివై
సన్నజాజి నవ్వులతో నన్నేలే రాణివై
నేవలచిన రంభవై - నచ్చిన ఇల్లాలివై
నా భావికి వెలుగుబాట కావాలి నీవు ॥ఎన్నాళ్ళకు॥

ఆమె ; తనువులోని సగభాగం తరుణికిచ్చె ఆ స్వామి
మనసంతా చెలికే అర్పించినావు నాస్వామి
ఎదనిండా నీవుండగ ఏకోరికలేదు
నీపాద పరాగముగ నిలిచిపోదు నేను ॥ఎన్నాళ్ళకు॥

10వ పాట

రచన : డా॥ సి. నారాయణరెడ్డి పాడినవారు : సుశీల, జిక్కి



సుభద్ర : మరదలా మరదలా తమ్ముని
పెళ్లామా
ఏమమ్మా వైనమేమమ్మా

సుజాత : వదినమ్మ వదినమ్మ
అన్నయ్య పెళ్లామ
ఏమమ్మా వైన మేంటమ్మా

సుభద్ర : చక్కనీ తిలకమ్ము ముక్కున జారింది
ఏమమ్మా అది ఏమమ్మా

సుజాత ; వల్లమాలిన చెమట గల్లంతుచేసింది
లేవమ్మా ఇంతెలేవమ్మా

సుభద్ర : చల్లనివేళలో చిరుచెమటలేమిటో
బుల్లెమ్మా గడుసు బుల్లెమ్మా
సుజాత : తీసున్న కిటికీలు మూసేస్తె జరిగింది
లేవమ్మా నన్ను వొదులమ్మా
సుభద్ర : పాలబుగ్గలమీద వాడిపోనిగంటు
లేమమ్మా వైనమేమమ్మా
సుజాత : పెంపుడుచిలకొచ్చి చెంపలుకొరికింది
లేవమ్మా అంతేనోయమ్మా
సుభద్ర : జాముఠాతిరికాదు జడపూలువాడేను
ఏమమ్మా మర్మమేమమ్మా
సుజాత : ప్రక్కన వత్తిడి కనిసొక్కిపోయినవేమొ
లేవమ్మా చాలు పోవమ్మా
సుభద్ర : చీటికిమాటికి పైటజారెనేమొ
మరదలా బుల్లి మరదలా
సుజాత : పట్టుచీర వకపట్టాన నిలవదు
వదినమ్మా గడుసు వదినమ్మా
సుభద్ర : ఉన్నపాటున రైక ముడిపీడిపోయింది
ఏమమ్మా వైన మేమమ్మా
సుజాత : ఎదలోనిపొంగుతొ సడలిపోయిందేమొ
లేవమ్మా చాలు చాలమ్మా
సుభద్ర : గదిలోని దీపమ్ము వొదిగి వొదిగి వెలిగింది
ఏమమ్మా వింత యేమమ్మా
సుజాత : మదిలోని నారాజు గదిలోనె వున్నాడు

పోవమ్మా చాలు పోవమ్మా

సుభద్ర : తెలిసింది లోగుట్టు చాలించు నీ బెట్టు
మరదలా బుల్లి మరదలా

సుజాల : నీకు తెలియని గుట్టు నాకెక్కడిది ఒట్టు
వదినమ్మా యింక వాదులమ్మా
వదినమ్మా యింక వాదులమ్మా

సుభద్ర : గడుసు బుల్లెమ్మా చాలు వెళ్లమ్మా
గడుసు బుల్లెమ్మా చాలు వెళ్లమ్మా

11. పద్యం పాడినవారు : మాధవపెద్ది

ధరసింహాసనమై - నభంబుగొడుగై తద్దేవతల్ భృత్యులై
మహాప్రభో
పరమాన్యాయము లెల్లవంది గణమై, బ్రహ్మాండమాకారమై
సిరిభార్యామణియై - విరించికొడుకై - శ్రీగంగ సత్పుత్రియై
వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై వర్థిల్లు-మహాప్రభో!

12 పద్యం

పాడినవారు : మాధవపెద్ది



ఖగపతి అమృతము తేగా
భుగభుగమని పొంగిచుక్క భూస్థలి
బడియెన్
పొగచెట్టయి జన్మించెను
పొగత్రాగనివాడు దున్నపోతై బుట్టున్!

13వ పాట

రచన : కొసరాజు   పాడినవారు : మాధవపెద్ది

1 ఎవరుచేసినకర్మ వారనుభవించకా
ఎప్పుడైనా తప్పదన్నా!
అసలువడ్డీతోటి సిసలుగా ఫలితమ్ము
అనుభవించుట తథ్యమన్నా !!



2 కోడలూపోగానె చుక్కమ్మచేతికి
చీపురూకట్టొచ్చెరన్నా !
నడుము నొప్పితోటి చాకిరీ చేస్తుంటే
చేసింది తెలిసొచ్చునన్నా !!

3 గయ్యాళి అత్తలూ యింటింట కొందరూ
దెయ్యాలవలె వుందురన్నా !
వేపమండలుబెట్టి వాయించితేగాని
పట్టింది వదలబోదన్నా !!

4 చుక్కమ్మదాచిఁది మాచమ్మ మింగింది
మర్మమేమిటో చెప్పరన్నా !
ఊరినోళ్లుగొట్టి కూడబెట్టినసొమ్ము
కాళ్లొచ్చిపోయెరోరన్నా !!

5 మొగుడు ముండైతేను కొడుకు వెధవైతేను
పెళ్ళాల ప్రభ సాగునన్నా !
అయినవారూలేక కానివారికిగాక
యీ మొండి బ్రతుకెందుకన్నా !!

6 అత్త ఒకరోజున కోడలేనన్నదీ

గుర్తుకొస్తేచాలునన్నా !

అందాక యీ పాడుకొంపలకు ఎన్నటికి

మోక్షమ్ము గల్గబోదన్నా !!

పంపిణీదారులు :

తెలంగాణా : దివ్యదత్తా కంబైన్స్

సికింద్రాబాదు

శ్రీ పద్మనాభ, విజయవాడ-3

రామకృష్ణా : ఎన్. ఏ. టి. కంబైన్

"వరకట్నం"

నిర్మాత : త్రివిక్రమరావు

కథ; స్క్రీన్ ప్లే; దర్శకత్వం		నటరత్న, పద్మశ్రీ **యన్. టి. రామారావు.** బి. ఏ.,
సంభాషణలు	;	మద్దిపట్లసూరి; సముద్రాల (జూనియర్)
పాటలు	;	కొసరాజు; డా॥ సి. నారాయణరెడ్డి
సంగీతం	;	టి. వి. రాజు
సహాయకుడు		విజయా క్రిష్ణమూర్తి
నృత్యం	;	వెంపటి సత్యం
కళ	;	క్రిష్ణారావు
కూర్పు	;	**జి. డి. జోషి**
దుస్తులు	;	**రామమూర్తి**
వేషధారణ	;	పీతాంబరం; భద్రయ్య
పోరాటములు	;	సాంబశివరావు; స్వామినాధన్
నిర్మాణచాలకుడు	;	కె. ఆర్. వి. ప్రసాదరావు
సహకార దర్శకుడు	;	రమేష్
చిత్రీకరణ	;	**రవికాంత్ నగాయిచ్**

మా కళాభిమానులకు

రామకృష్ణ; ఎన్.ఎ.టి. కంబైన్

సమర్పించబోవు

కళాఖండాలు

కోడలు దిద్దిన కాపురం

చాణక్య శపథం

విప్లవజ్యోతి

అల్లూరి సీతారామరాజు

శ్రీరామ పట్టాభిషేకము